క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు



భూత్పూర్: పట్టణంలో భక్తి శ్రద్ధలతో గ్యార్మీ షరీఫ్ వేడుకలు నిర్వహించారు. బుధవారం ఉదయం జెండా ఏర్పాటు చేసి, అనంతరం దర్గా వద్ద అన్నదాన కార్యక్రమం చేశారు. మంగళవారం రాత్రి గంధం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జెండాతో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత మహ్మద్ సాదిక్, పాన్నకల్ మహమూద్, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ



హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి శ్రీలక్ష్మీ గోశాల, కారంతండాల్లో బుధవారం పశువులకు గాలికుంటు టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు వేశారు. ముందుగా శ్రీలక్ష్మీ గోశాలలోని పశువులన్నింటికీ టీకాలను వేశారు. కారంతండాలో ఉన్న పశువులకు గాలికుంటు టీకాలను ఇచ్చారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారిని విజయలక్ష్మి, వీఏ మహేందర్, ఎల్ఎస్ఏ నరేష్, జేయూఓ హరిప్రసాద్, గోపాల మిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు ఘన సన్మానం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డిని బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పాలమూరు రెడ్డిసేవా సమితి ప్రతినిధులు సన్మానం చేశారు. పూలబొకే అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జి.వెంకట్రాంరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్‌రెడ్డి, కార్యదర్శి యూ.కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రిటైర్డ్ తహసీల్దార్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్‌రావు జయంతి సందర్భంగా పద్మశాలి పట్టణ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు నీలికిషోర్ మాట్లాడుతూ ప్రభాకర్‌రావు జిల్లాలోని పద్మశాలీలను ఏకతాటిపైకి తెచ్చి చైతన్య పరిచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో రామస్వామి, వెంకటేశ్, సుకుమార్, ప్రవీన్‌కుమార్, సంతోష్, శ్రీకాంత్, వెంకటేశ్

జమిలీ ఎన్నికలు దేశ ఫెడరల్ వ్యవస్థకు విఘాతం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేశంలో జమిలీ ఎన్నికలు నిర్వహించడమంటే దేశ ఫెడరల్ వ్యవస్థకు విఘాతం కల్గినట్లేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే సంస్కృతి, ఒకే నాయకుడు అన్న సిద్ధాంతంతో కేంద్రంలో బీజేపీ సర్కారు ముందుకు పోతుందన్నారు. జమిలి ఎన్నికలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించడంతో బీజేపీ ఫాసిస్టు విధానం బయటపడిందన్నారు. బీజేపీ విధానాలు దేశ సమైక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. జమిలీ ఎన్నికలపై ప్రజలకు 15 రోజుల పాటు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్, జిల్లా కార్యదర్శి రాములు, కిల్లె గోపాల్, కురుమూర్తి పాల్గొన్నారు.

దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి

- మొబైల్ యాప్ ద్వారానే అన్నీ నమోదు చేయాలి
- పాలమూరు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి
- రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఎల్‌ఆర్‌ఎస్‌పై ఒకరోజు శిక్షణ



అప్రోచ్ రోడ్డు కోసం ప్రైవేట్ భూమి పట్టాదారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎల్‌ఆర్‌ఎస్‌కు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం రాత్రి స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వివరాలను మొబైల్ యాప్ ద్వారానే నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో లే-అవుట్ లేదా ప్లాట్‌లో అన్నీ సరిగా ఉన్నాయా? లేదా? సరి చూసుకొన్న తర్వాతే నిబంధనల మేరకు అప్రూవల్ చేయాలన్నారు. కాగా, ఈ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని టీపీఓ లక్ష్మీపతి, టీపీఎస్ సునీల్ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు ముజీబుద్దీన్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు కోసం పట్టా భూమి పరిశీలన

కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డును ఆనుకుని భూత్పూర్ – చించోళి జాతీయ రహదారి నిర్మిస్తున్నందున అప్రోచ్ రోడ్డు కోసం బుధవారం ఉదయం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి మరోసారి పరిశీలన జరిపారు. అయితే కొందరి ప్రైవేట్ పట్టా భూమిలో నుంచి ఈ రోడ్డు వేయాల్సి ఉన్నందున వారితో మాట్లాడారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండల ఆర్‌ఐ నర్సింగ్, సర్వేయర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



నసరుల్లాబాద్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు చేస్తే సహించబోమని, రెండేళ్లలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నసరుల్లాబాద్ శివారులోని పెద్ద చెరువులో మూడు రకాల 60వేల చేప పిల్లలను వదిలారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన తమ పదవి కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, రెండేళ్ల కాలంలో మరింతగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. అభివృద్ధికి అడ్డుపడే వారికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. నియోజక వర్గంలోని ఆరు మండలాల పరిధిలో 386 చిన్న, పెద్ద చెరువుల్లో 24.72 లక్షల చేప పిల్లలు వదులుతున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ముందస్తుగానే కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో సింగిల్‌విండో, ఐకేపీల ఆధ్వర్యంలో 40 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తంగెళ్ల జ్యోతి, వైస్ చైర్మన్ రాజేందర్‌గౌడ్, మత్స్య శాఖ ఏడీ రాధా రోహిణి, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సునీత, ఏపీఎం మాల్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లపై సామాజిక తనిఖీ



సిద్దాయిపల్లి వద్ద డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న తనిఖీ బృందం సభ్యులు

భూత్పూర్: మున్సిపల్ పరిధిలోని సిద్దాయిపల్లి 1వ వార్డులో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లపై బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశానుసారం డబుల్ బెడ్రూం ఇళ్లపై మూడు రోజుల పాటు తనిఖీ చేయనున్నట్లు ఎస్ఆర్పీ భద్రునాయక్ తెలిపారు. 288 డబుల్‌బెడ్రూంలకు గాను, 251 ఇళ్లకు 5 టీంలుగా ఏర్పడి నివాసం ఉంటున్న వారి వివరాలు, మంచి నీటి సౌకర్యం, డ్రైయినేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యం తదితర విషయాలు ఇంటింటికి తిరిగి సేకరిస్తారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్, ఇద్దరు ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది డబుల్ బెడ్రూంల వద్దకు రావడంతో సామాజిక తనిఖీ బృందం వారిని అనుమతించ లేదు. తామే స్వయంగా తనిఖీ చేస్తామని, చివరి రోజు ప్రజావేదిక ఏర్పాటు చేసి సమస్యలు స్వీకరిస్తామని ఎస్సార్పీ బద్రునాయక్ తెలిపారు. ఒక్కసారిగా సామాజిక తనిఖీ బృందం, మండల స్థాయి అధికారులు, సిబ్బంది డబుల్‌బెడ్రూంల వద్దకు రావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



నవాబుపేటలో కొత్త ఉపాధ్యాయులతో మండల అధికారులు



భూత్పూర్‌లో ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ ఉషారాణి

నవాబుపేట: ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, దాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తే గొప్ప వ్యక్తులను దేశానికి అందించే శక్తి ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి నాన్యనాయక్ అన్నారు. బుధవారం మండలంలో పలు పాఠశాలలకు నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలు విద్యాధికారి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి, ప్రణాళికల ప్రకారం బోధన చేయాలని సూచించారు. అనంతరం పీఆర్‌టీయూ నాయకులు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీఆర్పీ జనార్దన్, పీఆర్టీయూ నాయకులు విజయ్, యాదయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి..

చిన్నచింతకుంట: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ మురళీకృష్ణ అన్నారు. చిన్న చింతకుంట మండలానికి నూతనంగా నియమితులైన 27 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ కార్యాలయంలో నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాగరాజు, జయంతి ఉన్నారు.

భూత్పూర్: నూతన ఉపాధ్యాయులు ముగ్గురు బుధవారం విధుల్లో చేరారు. ఎంఈఓ ఉషారాణి ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులను మండల పీఆర్టీయూ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడు కె. యాదయ్య, సురేష్‌రెడ్డి, దస్తయ్య సన్మానించారు.

రాచాలలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

అడ్డాకుల: మండలంలోని రాచాలలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఇటీవల ముగిసిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అండర్-17 బాలికల కబడ్డీ, అండర్-19 బాలుర కబడ్డీ పోటీలకు రాచాల ఆతిథ్యమివ్వనుంది. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కృషితో నియోజకవర్గంలో మొదటిసారి రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు రాచాల గ్రామం వేదిక కానుంది. నవంబర్ 3,4,5వ తేదీలలో అధికారులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కృషి వల్ల రాష్ట్రస్థాయి పోటీలకు రాచాల వేదికయ్యే అవకాశం దక్కిందని క్రీడాకారులు పేర్కొంటున్నారు.

మానవ సేవయే మాధవసేవ



జడ్చర్ల టౌన్: మానవ సేవయే మాధవసేవ అని సత్యసాయి సేవాసమితి వేద విభాగం రాష్ట్ర కన్వీనర్ ఫణీంద్ర అన్నారు. పట్టణంలోని సాయిమందిరంలో బుధవారం నిర్వహించిన పర్తియాత్ర విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. సత్యసాయిబాబ దేశ విదేశాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని, ఆయన మార్గంలోనే మనమంతా పయనించాలన్నారు. పర్తియాత్ర విజయవంతం కావటానికి సహకరించిన వారికి ఆయన షీల్డుతో సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి జిల్లా కన్వీనర్ సాయిబాబ, జడ్చర్ల కన్వీనర్ రామకృష్ణ, సాయి భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని జిల్లా రైస్, ఆయిల్ మిల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీ.వెంకటేశ్ అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1978లో మనరాష్ట్రంలో ఐఎఫ్‌టీయూ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు అనేక కార్మిక సంఘాలు అనుబంధంగా పని చేశాయన్నారు. 26 రంగాల కార్మికుల చట్టబద్ద యూనియన్లు అనుబంధంగా పని చేసినట్లు తెలిపారు. బీడీ, భవన, ఆటో, మోటార్, కేజీబీవీ, హమాలీ, మిల్ గోదాం వర్కర్స్, జీపీ తదితర రంగాల్లో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో యూనియన్ నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లు సంఘం ఉపాధ్యక్షుడు నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు దాసు, సంఘం నాయకులు శేఖర్, సతీష్, ఆంజనేయులు, కృష్ణయ్య, నారాయణ, బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

చేతిపంపులు వినియోగించుకోవాలి

- మిషన్ భగీరథ డీఈఈ రంజిత్‌రెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ డీఈఈ రంజిత్‌రెడ్డి

మహమ్మదాబాద్: గ్రామాల్లో చేతిపంపులను వినియోగించుకోవాలని మిషన్ భగీరథ డీఈఈ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మహమ్మదాబాద్ రైతు వేదికలో గ్రామ మంచినీటి సహాయకులకు చేతిపంపుల మరమ్మతుపై నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చేతిపంపుల మరమ్మతు, మోటారు రిపేర్, పైప్‌లైన్ లీకేజీ, డ్రింకింగ్ వాటర్ క్వాలిటీ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో డీఈఈ వారికి ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చాలా వరకు చేతి పంపులున్నాయని, అవి మరమ్మతుకు నోచుకోక పోవడంతో మూలన పడ్డాయన్నారు. వాటిని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొస్తే గ్రామాల్లో నీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది గ్రామాల్లో సేవలందించడం ద్వారా మూలన పడే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ, ఆయా గ్రామాల శిక్షణకు వచ్చిన సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

కోయిల్‌కొండ: గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఈఈ పుల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ శివతేజ, ఎంపీడీఓ కాళప్ప, సూపరింటెండెంట్ హరిశ్చంద్రారెడ్డి, తదితరులు ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: అధికంగా మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. ఈనెల 6న రూరల్ పోలీసులు చేసిన డ్రంకెన్ డ్రైవ్‌లో రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయగా, 224 ఎంజీ బీఏసీ లెవెల్ వచ్చింది. దీంతో రాజును బుధవారం సెకండ్ క్లాస్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి కె.శశిధర్ వాహనదారుడికి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

కంకినల్లి నుంచి వరి పైరును కాపాడాలి



కుత్నేపల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్

రాజాపూర్: రైతులు సాగు చేసుకున్న వరికి కంకినల్లి ఆశిస్తూ పంటలను పాడు చేస్తోందని, దాని నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని బోడగుట్టతండా, కుత్నేపల్లి, మల్లేపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కంకినల్లి నివారణకు స్పైరోమెసిటిన్ ఒక మిల్లీ లీటర్, ప్రోఫికనజోల్ ఒక మిల్లీ లీటర్ మందును లీటరు నీటితో కలిపి పదిహేను రోజులకు ఒకసారి పంటపై పిచికారీ చేయాలన్నారు. పత్తిలో కురుస్తున్న వర్షాల కారణంగా పంట చేలలో వర్షపునీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. ఏఈఓలు శ్రీనివాస్, మహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

తోటల పునరుద్ధరణతో అధిక దిగుబడి



రుసుంపల్లి మామిడి అంటుకట్టును పరిశీలిస్తున్న డీడీ వేణుగోపాల్

గండేడ్: పాత తోటల పునరుద్ధరణతో అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా హార్టికల్చర్ అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రుసుంపల్లిలో మామిడికి అంటుకట్టడాన్ని పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పండ్లతోటల్లో కాపు కాయనివి, చిన్న చిన్న కాయలు కాసేవి, రోగాల బారిన పడినవి తదితర కొన్ని మొక్కలు ఉంటాయని ఆయన తెలిపారు. వాటి స్థానంలో కొత్త మొక్కలను పునరుద్ధరించడానికి అంటుకట్టు పద్ధతిని అవలంభించాలన్నారు. పాత మొక్కల కొమ్మలను రంపంతో సగం వరకు కోసి వేయాలన్నారు. కొన్ని రోజులకు పిలకలు వస్తాయన్నారు. ఆ పిలకలకు మంచి కాపు కాసే మొక్కల కొమ్మలు కట్ చేసి అంటుకట్టాలన్నారు. అది పెద్దగా అయ్యాక కింద ఉన్న పాత మొక్కను తొలగించాలన్నారు. ఇష్టమైన రకాన్ని ఈ అంటు కట్టె పద్ధతి ద్వారా పొందవచ్చన్నారు. మార్కెట్‌లో డిమాండు ఉన్న రకాన్ని పండించే అవకాశం ఈ విధానం ద్వారా సాధ్యమవుతుందన్నారు. పాత తోటల పునరుద్ధరణతో రైతులు అధిక దిగబడులు పొంది ఆశించిన లాభాలు పొందవచ్చన్నారు. ఈ తరహా అంటు పద్ధతులను పండ్లతోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ స్వప్న, రైతులు పాల్గొన్నారు.

విగ్రహం ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పాలమూరు: హైదరాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫరూఖ్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ మతాన్ని పూజిస్తూ ఇతర మతాలను గౌరవించడం అనేది లౌకికవాదం అవుతుందని, ఒకే వర్గాన్ని వెనకేసుకొచ్చే విధానం లౌకికవాదం కాదన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సభ్యులు యూసుఫ్, రషీద్, ఖలీద్ పాల్గొన్నారు.

చదువుపై దృష్టి పెడితే ఉత్తమ భవిష్యత్



ఎల్కిచర్ల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు కళాజాత బృందం సభ్యులు

భూత్పూర్: నేటి యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా, చదువుపై దృష్టి పెడితే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని సురక్ష పోలీసు కళాబృందం సభ్యులు డీ.రాములు, బీ.జగదీష్, శివరాములు, ఏహెచ్‌టీయూ సభ్యులు వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు, సురక్ష పోలీస్ కళాబృందం సభ్యులు కళా ప్రదర్శన నిర్వహించారు. బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. నేడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని, గంజాయి మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం వల్ల యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్వినియోగం లెక్కలు తేల్చారు

- రూ.1,49,36,205 పక్కదారి పట్టించిన ఆర్‌పీ
- పూర్తి నివేదికను సమర్పించిన విచారణ బృందం
- ఉన్నతాధికారులకు పంపించిన మున్సిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కోయనగర్‌కు చెందిన ఆర్‌పీ శ్రీలత వివిధ స్వయం సహాయక సంఘాల పేరుతో భారీగా రుణాలు తీసుకుని నెలవారీ కిస్తులు చెల్లించకుండా మొత్తం రూ.1,49,36,205 దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణ బృందం తనిఖీలో బయటపడింది. ఇందులో బ్యాంకు లింకేజీ కింద రూ.85,55,514, చిన్న సంఘాల పొదుపు ఖాతాల ద్వారా రూ.29,04,024, స్త్రీనిధి కింద రూ.28,24,307, పెద్ద సంఘాల పొదుపు ఖాతాల ద్వారా రూ.6,52,360 ఉన్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను విచారణ బృందం మెప్మా డీఎంసీ శివకుమార్ నేతృత్వంలో బుధవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డికి అందజేశారు. దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన సమగ్ర నివేదికను తయారు చేసి హైదరాబాద్‌లోని మెప్మా ఎండీ గౌతమ్‌తో పాటు కలెక్టర్ విజయేందిర, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మెప్మా ఇన్‌చార్జి పీడీ సురేందర్‌రెడ్డిలకు పంపించారు. కాగా, ఈ వ్యవహారంలో దుర్వినియోగానికి పాల్పడిన ఆర్‌పీ శ్రీలతతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఓ యాదయ్యపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



కృష్ణయ్య (ఫైల్)

భూత్పూర్: మున్సిపాలిటీలోని నర్సింగాపూర్‌కు చెందిన అనుప కృష్ణయ్య (70) ఈనెల 13న అదృశ్యమయ్యాడు. బుధవారం గ్రామ సమీపంలోని కతాల్‌ఖాన్ చెరువు వద్ద ఆయన మృతదేహం లభ్యమైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ వివరాల ప్రకారం.. ఈనెల 13న అదృశ్యమైన అనుప కృష్ణయ్యను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి వెతికారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద ఉన్న డ్రోన్ కెమెరా సహాయంతో వెతకగా చెరువుకట్ట వద్ద కంప చెట్లలో మృతదేహం కన్పించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరి మృతదేహాన్ని బయటకు తీసి అనుప లక్ష్మయ్యగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, పోస్టుమార్టం ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పల్లె రహదారులకు రూ.15 కోట్లు మంజూరు

దేవరకద్ర: నియోజకవర్గంలోని 10 గ్రామాలకు కొత్త బీటీ రహదారుల కోసం రూ.15కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకద్ర, అడ్డాకుల, చిన్నచింతకుంట, కొత్తకోట మండలాల పరిధిలోని గ్రామాలకు కొత్త బీటీ రహదారులు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అడ్డాకుల మండలం రాచాల నుంచి ఇద్రంపల్లి వరకు 6 వందల మీటర్ల రహదారికి రూ.55 లక్షలు, చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ నుంచి నెల్లికొండి వయా సీతారాంపేట్ మీదుగా 3.5 కిలోమీటర్ల రహదారికి రూ.3 కోట్లు, దేవరకద్ర మండలం గద్దెగూడెం నుంచి కోటకద్ర రహదారి వరకు 1.36 కిలో మీటర్ల రహదారికి రూ.1.20 కోట్లు, చిన్నచింతకుంట మండలం లక్ష్మీదేవ్‌పూర్ నుంచి ఉంద్యాల మద్దూర్ లింక్ రోడ్డు 2.85 కిలో మీటర్ల రహదారికి రూ. 2.50 కోట్లు, దేవరకద్ర మండలం బస్వాయపల్లి నుంచి నందిపేట వరకు 3 కిలో మీటర్ల రహదారికి రూ.2.55 కోట్లు, చిన్నరాజమూర్ నుంచి నాగన్నపల్లె మీదుగా కోయిల్‌సాగర్ 1.70 కిలో మీటర్ల రహదారికి రూ. 2 కోట్లు, అడ్డాకుల మండలం ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి చౌడయ్యపల్లి 6 వందల మీటర్ల రహదారికి రూ.55 లక్షలు, అడ్డాకుల మండలం జెడ్పీ రోడ్ నుంచి దుబ్బపల్లి 7 వందల మీటర్ల రహదారికి రూ.60 లక్షలు, అడ్డాకుల మండలం కందూర్ నుంచి వడ్డేపల్లికి 1.20 కిలో మీటర్ల రహదారికి రూ. 1.05 కోట్లు, కొత్తకోట మండలం జెడ్పీ రోడ్ నుంచి వడ్డేవాట వయా సత్యహల్లి 1.20 కిలో మీటర్ల రహదారికి రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ నుంచి జీఓ ఆర్‌టీ 584 కాపీని పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంపీడీఓ కాళప్ప

కోయిల్‌కొండ: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీఓ కాళప్ప అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మార్సీలో పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ మొగులయ్య, సీఆర్‌పీలు శంకర్, హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.